# ఊరూరా జెండాల ఆవిష్కరణ

- పండుగలా కార్మిక దినోత్సవం
- బీజేపీ, కాంగ్రెస్‌లను ఓడించాలని నాయకుల పిలుపు

వికారాబాద్ జిల్లా వ్యాప్తంగా కార్మికుల దినోత్సవ కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. వివిధ పార్టీలు, సంఘాల ఆధ్వర్యంలో మే డేను నిర్వహించారు. ఊరూవాడా జెండాలను ఆవిష్కరించి, శ్రమజీవుల కృషిని గుర్తు చేసుకున్నారు. కార్మికుల హక్కులను సాధించే దిశగా సంఘటితం కావాలని పలువురు నాయకులు పిలుపునిచ్చారు.

పరిగి, మే 1: కార్పొరేట్ శక్తులకు కొమ్ము కాస్తున్న బీజేపీని మేడే స్ఫూర్తితో చిత్తుగా ఓడించాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎం.వెంకటయ్య పేర్కొన్నారు. బుధవారం సీఐటీయూ ఆధ్వర్యంలో 138వ అంతర్జాతీయ కార్మిక దినోత్సవం సందర్భంగా పరిగి మున్సిపల్ కార్యాలయం ముందు సీఐటీయూ జెండాను వెంకటయ్య ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెట్టుబడిదారులను ఎదిరించి పోరాటం చేసి కార్మిక చట్టాలు, హక్కులను సాధించుకున్నామన్నారు. అనేక సంవత్సరాలు పోరాటం చేసి, త్యాగాలతో 42 కార్మిక చట్టాలను సాధించుకుంటే, ఆ చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్‌లుగా కుదించారని పేర్కొన్నారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి రామకృష్ణ మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం 8 గంటల పనిదినాన్ని 12 గంటలకు



తాండూరు రూరల్ : విద్యుత్ కార్యాలయం వద్ద ..

పెంచి కార్మికులకు తీవ్ర అన్యాయం చేసిందన్నారు. పెరిగిన పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ ధరలు నియంత్రించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు హబీబ్, సత్యయ్య, రఘురామ్, మున్సిపల్ కార్మికులు కిష్టయ్య, నర్సింహులు, రమేశ్, చందర్, నరేందర్, విద్యుత్ కార్మికులు ఆనంద్, జంగయ్య, భీమయ్య, శేఖర్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

**కొడంగల్:** మే డే వేడుకలను కార్మికులు పండుగలా, ఆనందోత్సవాల మధ్య జరుపుకున్నారు. ఈ సందర్భంగా బుధవారం పట్టణంలో సీపీఐ సీనియర్ నాయకుడు ఇందనూర్ బషీర్‌తో పాటు నాయకులు జెండాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నేటికీ కార్మికులకు శ్రమ దోపిడీ తప్పడం లేదన్నారు. కనీస వేతనాలు లభించక ఎందరో కార్మికులు వెట్టిచాకిరీ చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించినప్పుడే వారి కష్టాలు తీరుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. అలాగే భవన నిర్మాణ, అసంఘటిత కార్మికులు అంబేద్కర్ కూడలిలో జెండాను అవిష్కరించారు.



వికారాబాద్: : బీఆర్‌టీయూ ఆధ్వర్యంలో



పరిగి: జెండా ఎగురవేస్తున్న సీపీఎం జిల్లా నాయకుడు వెంకటయ్య



కొడంగల్ పట్టణంలో...



బొంరాస్‌పేటలో..

కార్యక్రమంలో సీపీఐ, సీఐటీయూ, భవన నిర్మాణ కార్మికులు పాల్గొన్నారు.

**బొంరాస్‌పేట :** ప్రపంచ కార్మిక దినోత్సవం మేడేను బుధవారం బొంరాస్‌పేట, దుద్యాల మండల కేంద్రాల్లో ఘనంగా నిర్వహించారు. సీఐటీయూ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బుస్స చంద్రయ్య మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దేశ ఆర్థిక సార్వభౌమత్వ పరిరక్షణలో కీలకపాత్ర మహించే ప్రభుత్వరంగ సంస్థల్ని అంతకంతకూ ధ్వంసం చేస్తుందని విమర్శించారు. కార్మికుల ప్రయోజనాలకు వ్యతిరేకంగా పనిచేసే ప్రభుత్వాలకు వ్యతిరేకంగా సీఐటీయూ పోరాడుతుందని చంద్రయ్య అన్నారు. కార్యక్రమంలో వివిధరంగాల కార్మికులు పాల్గొన్నారు

**తాండూరు రూరల్ :** తాండూరు మండలంలో మే డే ఉత్సవాలను కార్మికులు ఘనంగా జరుపుకొన్నారు. సీసీఐ, పెన్నా, ది ఇండియా సిమెంట్స్, విద్యుత్ కార్యాలయాల వద్ద కార్మికులు ఎర్ర జెండాలను ఎగురవేశారు. ఏఈ వెంకట్‌నాయుడు, డీవిజన్ కార్యదర్శి సింహాచలం, జయసింగ్, వెంకటయ్యగౌడ్, అశోక్, హరికుమార్, చుక్కయ్య, దేవయ్యతోపాటు పలువురు పాల్గొన్నారు.

**వికారాబాద్ :** కార్మికుల హక్కుల కోసం కార్మికవర్గం ఉద్యమించాల్సిన అవసరం ఉందని బీఆర్‌టీయూ వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు టైగర్ భూముల కృష్ణయ్య పిలుపునిచ్చారు. మే డేను పురస్కరించుకొని బుధవారం పట్టణంలో ప్రభుత్వ దవాఖాన ఎదుట జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..బీజేపీ ప్రభుత్వం రైతు వ్యతిరేక ప్రభుత్వమన్నారు. రాష్ట్రం లోని కాంగ్రెస్ ప్రభుత్వం, ఎన్నికల ముందు కార్మికులకు ఎన్నో హామీలు ఇచ్చిం దని, జీతాలు పెంచుతామని, కాంట్రాక్టు కార్మికులను రెగ్యులరైజ్ చేస్తామని, నెల నెలా జీతాలు చెల్లిస్తామని, కాంట్రాక్టు వ్యవస్థను రద్దు చేస్తామని, ఇంకా ఎన్నో హామీలు ఇచ్చి వాటిని విస్మరించిందన్నారు. కార్యక్రమంలో యూని యన్ నాయకులు, బీఆర్‌టీయూ జిల్లా నాయకులు అనంతయ్య, కృష్ణ, సురేశ్, పద్మమ్మ, లక్ష్మి, లలిత, అనంతమ్మ, రాములు, పెంటమ్మ, బాలమణి పాల్గొన్నారు. వికారాబాద్ విద్యుత్ డీఈ కార్యాలయం ముందు విద్యుత్ హెచ్ 82 యూనియన్ సమక్షంలో కార్మికులు మేడే సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ 82 యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ సుభాన్, రాంరెడ్డి, గంగన్న ,లక్ష్మణ్, శేఖర్ యూనియన్ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

**కులకచర్ల:** కులకచర్ల, చౌడాపూర్ మండలాల్లో మే డే వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామ పంచాయతీల్లో పంచాయతీ కార్మికులను సన్మానించారు. చౌడాపూర్ మండల పరిధిలోని మందిపల్ పంచాయతీలో గ్రామ బీఆర్ఎస్ నాయకులు, మాజీ సర్పంచ్ తనయుడు మఠం రాజశేఖర్ పంచాయతీ సిబ్బందిని యువజన సంఘాల ఆధ్వర్యంలో సన్మానించి వారు చేస్తున్న సేవలను కొనియాడారు. కులకచర్ల మండల కేంద్రంలోని భవన నిర్మాణ సంఘం ఆధ్వర్యంలో కార్మిక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భవన నిర్మాణ కార్మికులు చేస్తున్న సేవలను పలువురు



వికారాబాద్: విద్యుత్ కార్యాలయం ముందు...

నాయకులు కొనియాడారు. కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి, నాయకులు జోగు వెంకటయ్యగౌడ్, కుమ్మరి స్వామి, మహిపాల్, భవన నిర్మాణ సంఘం అధ్యక్షుడు కృష్ణయ్యయాదవ్, ఉపాధ్యక్షుడు రాంచంద్రయ్య, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, సలహాదారులు వెంకట్‌రాములు, గడ్డమీది రాములు, గుడిసె అంజయ్య తదితరులు పాల్గొన్నారు.



కులకచర్ల: భవన నిర్మాణ సంఘం ఆధ్వర్యంలో..

## నేడు బీఆర్ఎస్ ఆశీర్వాద సభ



సభ ఏర్పాట్లు పరిశీలిస్తున్న రోహిత్‌రెడ్డి, బీఆర్ఎస్ నేతలు

తాండూరు, మే 1: ఎంపీ ఎన్నికల్లో భాగంగా గురువారం సాయంత్రం 5 గంటలకు యాలాల మండల పరిధిలోని లక్ష్మినారాయణపూర్ సమీపంలో యాలాల, బషీరాబాద్ మండలాల బీఆర్ఎస్ ఆశీర్వాద సభ నిర్వహిస్తున్నట్లు మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి తెలిపారు. బుధవారం సభ ఏర్పాట్లను రోహిత్‌రెడ్డి, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రాజుగౌడ్, జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ బైండ్ల విజయకుమార్ స్థానిక నేతలతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీఆర్ఎస్ ఆశీర్వాద సభ ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్, మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి హాజరవుతున్నట్లు తెలిపారు. యాలాల, బషీరాబాద్ మండల పరిధిలోని బీఆర్ఎస్ శ్రేణులు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు.

**నేడు బీఆర్ఎస్ ధారూరు మండల సమావేశం**

ధారూరు, మే 1: బీఆర్ఎస్ పార్టీ మండల సమావేశం గురువారం పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు పార్టీ మండల అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. ఉదయం 10.30 గంటలకు మండల కేంద్రంలోని స్టార్ ఫంక్షన్ హాలులో జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, చేవెళ్ల పార్లమెంటు అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్, పార్టీ ముఖ్యనాయకులు హాజరవుతున్నారని తెలిపారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, నాయకులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

## ఘనంగా భద్రేశ్వర ఉత్సవాలు ప్రారంభం



భద్రేశ్వర స్వామి పల్లకి సేవలో భక్తులు

తాండూరు, మే 1: శ్రీ భావిగి భద్రేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. తొమ్మిది రోజుల పాటు ఘనంగా జరిగే మహోత్సవాలకు నిర్వాహకులు ఏర్పాట్లు ముమ్మరంగా చేపట్టారు. బుధవారం ఆయలంలో ప్రత్యేక పూజల అనంతరం భద్రేశ్వర స్వామిని పల్లకీలో ఊరేగించారు. శనివారం శ్రీ భావిగి భద్రేశ్వర జాతర ఉత్సవాలలో ప్రధాన ఘట్టమైన రథోత్సవం, ఆదివారం లంకాదహన కార్యక్రమం నిర్వహించనున్నారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా నిత్యం ఉదయం 5 గంటల నుంచి ఆలయంలో సుప్రభాతం, రుద్రాభిషేకం, బిల్వార్చన, పుష్పార్చన, సాయంత్రం మంగళహారతి, తీర్థప్రసాద కార్యక్రమాలు, మధ్యాహ్నం నిత్య అన్నదాన కార్యక్రమాలు జరుగుతున్నాయి.

## ■ ఎన్నికల విధుల నిర్వహణపై శిక్షణ



పీవో, ఏపీవో, ఓపీవోలతో మాట్లాడుతున్న జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

కొడంగల్, మే 1: పార్లమెంట్ ఎన్నికలను పురస్కరించుకొని విధుల నిర్వహణపై పీవో, ఏపీవో, ఓపీవోలకు బుధవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. అలాగే పోలింగ్ కేంద్రంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఏర్పాట్లపై శిక్షకులు అవగాహన కల్పించారు. అదేవిధంగా జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ శిక్షణ కేంద్రాన్ని సందర్శించి పరిశీలించారు. పోలింగ్ ప్రక్రియపై పీవో, ఏపీవో, ఓపీవోలకు పలు సూచనలు, సలహాలను అందించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ విజయ్‌కుమార్‌తో పాటు ఎన్నికల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## అన్నారం శివారులో పులి సంచారం..
# భయాందోళనలో గ్రామస్తులు



అన్నారం శివారులో పులి ఆనవాళ్లను పరిశీలిస్తున్న అటవీశాఖ అధికారులు

కొడంగల్, మే 1: మండలంలోని అన్నారం గ్రామ శివారులోని పంటపొలాల్లో పులి సంచారంపై గ్రామస్తులు భయాందోళనకు గురవుతున్నారు. బుధవారం అటవీశాఖ అధికారి డీఎఫ్‌వోకు గ్రామస్తులు సమాచారం అందించారు. దాంతో స్థానిక అటవీ అధికారులకు ఆయన ఆదేశాలు జారీ చేశారు. స్థానిక అటవీ అధికారులు, సిబ్బంది గ్రామ శివారులోని పంట పొలాల్లో సంచరించి పులి ఆనవాళ్లను పరిశీలించారు. పంట పొలాల్లో గుర్తించిన ఆనవాళ్లను గుర్తించి పులి సంచరిస్తున్నట్లు ఫారెస్టు అధికారులు అనుమానాన్ని వ్యక్తం చేశారు. గ్రామస్తులు అప్రమత్తంగా ఉండాలని వారం రోజుల పాటు పంట పొలాలకు ఎవరూ వెళ్లవద్దని హెచ్చరించారు. పులి సంచారంపై పూర్తి నిఘా ఏర్పాటు చేస్తామని, ప్రజలు భయాందోళనకు గురి కావద్దని తెలిపారు. కార్యక్రమంలో ఎఫ్ఎస్‌వో ఫారూకల్లి, ఎఫ్‌బీవో, వహీద్, రాజు, రాముతో పాటు వెంటయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఊపందుకున్న ఇంటింటి ప్రచారం



వికారాబాద్:అంపల్లి గ్రామంలో



దోమ: కొండాయపల్లిలో...

ధారూరు, మే 1: బీఆర్ఎస్ పార్టీ బలపరిచిన చేవేళ్ల ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని పార్టీ మండల అధ్యక్షుడు శ్రీకాంత్ రెడ్డి కోరారు. బుధవారం ధారూరు మండల పరిధిలోని కుమ్మరిపల్లి, నాగారం, అంపల్లి తదితర గ్రామాల్లో పార్లమెంటు ఎన్నికల ప్రచారంలో భాగంగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కాసాని గెలుపు కోసం ప్రతి ఒక్కరూ సైనికల్లా పని చేయాలన్నారు. తెలంగాణ ప్రజలకు సీఎం రేవంత్ రెడ్డిపై నమ్మకం పోయిందని, ఆరు గ్యారెంటీల పేరుతో అధికారంలోకి వచ్చి ప్రజలను మోసం చేశారని తెలిపారు.

ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయలేకపోయారన్నిరు. చేవేళ్ల గడ్డపై మళ్లీ గులాబీ జెండా ఎగరవేయాలన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల నాయకులు బాబయ్య, అనంతయ్య, మల్లేశం, దేవేందర్, దశరత్, శ్రీనివాస్, రాజు, వెంకట్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

**దోమ:** పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో బుధవారం మండల పరిధిలోని కొండాయపల్లిలో బీఆర్ఎస్ పార్టీ యువ నాయకురాలు సనంద, పార్టీ గ్రామ అధ్యక్షుడు బల్ల బాలకృష్ణయాదవ్‌తో పాటు గ్రామంలోని మహిళలు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కారు గుర్తుకు ఓటు వేసి చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. కాంగ్రెస్, బీజేపీల కల్లబొల్లి మాటలు నమ్మి మరోసారి మోసపోవద్దని గ్రామస్తులకు సూచించారు. ప్రతి బీసీ బిడ్డ ఏ పార్టీలో ఉన్నా మన బీసీ నాయకుడు జ్ఞానేశ్వర్‌కు ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో హన్మంతు, బుగ్గయ్య, వేణు, శ్రీను, బసమ్మ, అంజిలమ్మ, మల్లమ్మ, నర్సమ్మ పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోళ్లు సక్రమంగా నిర్వహించాలి



కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఏపీడీ సరోజ, డీపీఎం రామ్మూర్తి

కులకచర్ల, మే 1 : ధాన్యం కొనుగోళ్లను సక్రమంగా నిర్వహించాలని డీఆర్‌డీఏ సెర్ప్ ఏపీడీ సరోజ, డీపీఎం రామ్మూర్తి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రైతుల ధాన్యాన్ని ఎప్పటి కప్పుడు సేకరించి వాటి వివరాలను ఏపీఎంఎస్ చేయాలని సూచించారు. దీంతో ధాన్యం పంపిన వెంటనే రైతులకు డబ్బులు పడుతాయన్నారు. కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు నిర్లక్ష్యంగా వ్యహరిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ధాన్యాన్ని సేకరించాలని సూచించారు. సేకరించిన ధాన్యాన్ని రైస్‌మిల్‌కు వెళ్లే వరకు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రైతుల నుంచి ఎలాంటి ఫిర్యాదులు రాకుండా చూడాలని సూచించారు. కార్యక్రమంలో కేంద్రం నిర్వాహకులు పాల్గొన్నారు.

# బీజేపీని గద్దె దింపాలి



ప్రచారం నిర్వహిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ మంజులారమేశ్ కాంగ్రెస్ పార్టీ వికారాబాద్ పట్టణ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి

వికారాబాద్, మే 1 : కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీని గద్దె దింపాలని కాంగ్రెస్ పార్టీ వికారాబాద్ పట్టణ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ మంజులారమేశ్ తెలిపారు. బుధవారం వికారాబాద్ మున్సిపల్ పరిధిలోని మద్గుల్ చిట్టంపల్లిలో ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వంట గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలను పెంచి కేంద్ర ప్రభుత్వం ప్రజలపై మోయలేని భారాన్ని మోపిందన్నారు. అదాని, అంబానీలకు లాభం చేకూరేలా మోదీ పని చేస్తున్నారని, మత ప్రచారంతో ప్రజలను మోసం చేస్తున్నారని వివరించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ ముత్తాహర్ షరీఫ్, నాయకులు చాకలి మల్లయ్య, మల్లికార్జున్ గౌడ్, వెంకటయ్య గౌడ్, రాజు, శ్రీనివాస్ ముదిరాజ్ పాల్గొన్నారు.

## కాంగ్రెస్ బైక్ ర్యాలీ



ర్యాలీలో ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

బషీరాబాద్, మే 1: పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు రాజవర్దన్‌రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం బషీరాబాద్‌లో బైక్ ర్యాలీ నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి హాజరయ్యారు. కార్యక్రమంలో పార్లమెంట్ తాండూరు ఎన్నికల ఇన్‌చార్జి కొనగాల మహేశ్, యువజన కాంగ్రెస్ చేవెళ్ల పార్లమెంట్ ఇన్‌చార్జి కృష్ణం రాజు పాల్గొన్నారు.

## ఎన్నికలు సజావుగా నిర్వహించాలి



శిక్షణా శిబిరంలో మాట్లాడుతున్న ఆర్డీవో వాసుచంద్ర

పరిగి, మే 1: ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు ప్రతిఒక్కరూ సహకరించాలని వికారాబాద్ ఆర్డీవో, ఏఆర్వో వాసుచంద్ర సూచించారు. బుధవారం పరిగిలోని జెడ్పీహెచ్ఎస్ నెం.1 లో పోలింగ్ ఆఫీసర్లు, ఏపీవోలకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆర్డీవో వాసుచంద్ర మాట్లాడుతూ చేవెళ్ల పార్లమెంటు ఎన్నికలకు సంబంధించి మూడు ఈవీఎంలు ఉంటాయని, వాటిని వరుస క్రమంలో ఏర్పాటు చేయాలన్నారు. ఎలాంటి తప్పిదాలు జరగకుండా క్రమ పద్ధతిలో వరుసగా ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ సందర్భంగా పోలింగ్ రోజు మాక్ పోల్ నిర్వహించడం, పోలింగ్ ఆఫీసర్ డైరీ, 17 సీ రాయడం తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పరిగి, కులకచర్ల తహసీల్దార్‌లు ఆనంద్‌రావు, మురళి, మాస్టర్ ట్రైనర్లు గోపాల్, శ్రీనివాస్, లాల్యానాయక్, వెంకట్, ప్రవీణ్, అంజయ్య, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

## కొలతల ప్రకారం వేతనం పొందాలి



ఉపాధి హామీ కూలీలకు సూచనలు ఇస్తున్న ఎంపిడీవో మహేశ్ బాబు

దోమ, మే 1: ఉపాధి హామీ కూలీలు కొలతల ప్రకారం పనులు చేసి సరైన వేతనం పొందాలని ఎంసీడీవో మహేశ్‌బాబు తెలిపారు. దోమ పరిధిలోని దొంగఎన్కెపల్లిలో కొనసాగుతున్న ఉపాధి హామీ పనులను బుధవారం టీఏ బాలయ్యతో కలిసి ఎంపిడీవో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎండల తీవ్రత అధికంగా ఉన్నందున కూలీలు తగిన జాగ్రత్తలు పాటించి సరక్షితంగా ఉండాలని సూచించారు. పని ప్రదేశంలో కూలీలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా తాగడానికి నీరు, విశ్రాంతి కోసం నీడను ఏర్పాటు చేయాలని పంచాయతీ కార్యదర్శి, సీనియర్ మేట్‌లకు సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి దేవ్‌సింగ్, సీనియర్ మేట్ సంజీవ్‌కుమార్, ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.

## డివిజన్ స్థాయి క్రికెట్ పోటీలు ప్రారంభం



పూడూరు, మే 1 : మండలంలోని తిర్మలాపూర్ పంచాయతీ పరిదిలోని రాకంచర్లలో డివిజన్ స్థాయి క్రికెట్ పోటీలను బుధవారం మాజీ సర్పంచ్ పెంటయ్య, పరిగి ఎమ్మెల్యే తనయుడు రితిక్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. విజేతలకు ప్రథమ బహుమతి రూ.50వేలు, ద్వితీయ బహుమతి రూ.25వేల నగదును అందజేయనున్నట్లు మాజీ సర్పంచ్ తెలిపారు. కార్యక్రమంలో గ్రామ యువజన సంఘాల నాయకులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.



వికారాబాద్ నియోజకవర్గం ధారూరు మండలం గురుదోట్ల గ్రామంలో బుధవారం చేవెళ్ల బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌కు మద్దతుగా ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న ఆ పార్టీ నాయకులు

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
WANTED
★ హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి భోజనం. జీతం: 16k to 18k, ఏజెంట్ కమీషన్ 6k. Ph: 9640258899, 9640468899
NT-311845-All
గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.